క్లుప్తంగా

108 కలశాలతో శివుడికి అభిషేకం



గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం స్వామి వారికి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



వరంగల్: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బందెల రవి కొన్ని రోజులుగా ఊపిరితిత్తులు, మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నాడు. ఈమేరకు బాధితుడికి వరంగల్‌కు చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ రూ.8500లను సోమవారం అందించారు. హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సుమన్ తెలిపారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని జంగాలపల్లికి చెందిన సర్గన రమేశ్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దనసరి సూర్య పరామర్శించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని ఆయన ఓదార్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు చాంద్‌పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు, అప్సర్‌పాషా, చింత క్రాంతి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, సుమన్‌రెడ్డి, అజ్జు, జగన్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

18న బీఎంఎస్ కార్యాలయం ప్రారంభం

భూపాలపల్లి అర్బన్ : ఈ నెల 18న ఏరియా బీఎంఎస్ కార్యాలయం ప్రారంభించనున్నట్లు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్యతో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జంగేడు ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ చిలువేరు అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు మంచి అవకాశం అని, ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెగ్యులర్ విద్య పూర్తి చేసి ఉత్తీర్ణులైన వారితో సమానంగా విద్య ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వివరాలకు, 9849397249, 94924 43141 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సైబర్ క్రైంపై అవగాహన

మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట, యామన్‌పల్లి, మాదారం క్రాస్‌రోడ్డుల వద్ద స్థానిక పోలీసులు సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. ఓటీపీ, ఫోన్ పే, గూగుల్ పే పై ఇటీవల జరుగుతున్న నేరాలపై గురించి వివరించారు. కొత్త వ్యక్తులు ఫోన్‌చేసి మీకు లోన్ వస్తుందని లేదా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటీపీ వచ్చిందని పలువురికి ఫోన్లు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి ఫోన్లు ఎవరికైనా వస్తే స్పందించవద్దని యువకులకు, గ్రామస్తులకు సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి 50 దరఖాస్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 50 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తెలిపారు. సోమవారం వివిధ భూసంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు.

వేతనాలు రాక సిబ్బంది అవస్థలు

- ఆకలితో అలమటిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
- పట్టించుకోని ఎంపీఓ, కార్యదర్శి



గత నెలలో బిల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జీపీ సిబ్బంది (ఫైల్)

ఏటూరునాగారం: వేతనాలు లేక వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని వైనం. పారిశుద్ధ్య పనులు చేసే వారికి కనీసం వేతనం కూడా స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు ఇవ్వలేకుండా పోతున్నారు. పర్యవేక్షణ చేసి చక్కదిద్దాల్సిన మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్లు 13, ఇద్దరు ఎలక్ట్రీషన్స్, ఇద్దరు కారోబార్లు, స్వీపర్లు, అటెండర్లు, ఇద్దరు పంపు మెకానిక్‌లు, ఒక్కరు కంప్యూటర్ ఆపరేటర్, సఫాయిలు 20, వాటర్ మెన్ ఇలా 40 మంది పనిచేస్తున్నారు. ఐదు నెలల నుంచి వేతనాలు అందక అన్నమో రామచంద్రా అంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. అందులో పనిచేసేవారంతా కూడా పేద వర్గాలకు చెందిన వారు కావడంతో వేతనంపై వారి జీవితం ఆధారపడి ఉంది. వేతనాల బిల్లు చేసి ప్రభుత్వానికి పంపించాం కానీ ఇంత వరకు జమకాలేదని అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇంటి పన్నులు వసూలు చేసిన డబ్బుల సైతం రో జువారి మెయింటనెన్స్ సరిపోవడం లేదని వాపోతున్నారు. అయితే మిగతా గ్రామ పంచాయతీల్లో బిల్లులను వేగంగా చేసి ఎస్టీఓలో టోకెన్‌ను ముందుగా సమర్పించడంతో బడ్జెట్ మంజూరై జీపీ సిబ్బందికి వేతనాలు వచ్చినట్లు మిగతా కార్యదర్శులు వాపోతున్నారు. కానీ ఏటూరునాగారం మేజర్ పంచాయతీలో పనిచేసే తాత్కాలిక సిబ్బందికి వేతనాలు లేక నానాఅవస్థలు పడుతున్నారు. బిల్లులు సమర్పించడం ఆలస్యం అయ్యిందా..అధికారుల తప్పిదం వల్ల సిబ్బంది ఆకలితో అలమటిస్తున్నారు. ఇటీవల జరిగిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో సైతం సిబ్బందికి వేతనాలు వస్తాయని చెప్పి వెట్టిచాకిరి చేయించుకున్నారు. గత నెల 6న గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేసి జీపీ బిల్ కలెక్టర్ రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కానీ దీనిపై స్థానిక ఎంపీడీఓ, ఎంపీఓ సైతం స్పందించకపోవడం బాధాకరంగా మారింది. ఇప్పటికైనా వేతనాలు ఇచ్చి సిబ్బందిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెట్టిచాకిరి చేయించుకుంటున్నరు



పంచాయతీ పరిధిలో పని చేసే సఫాయిలు, ఇతర సిబ్బందికి వెంటనే వేతనాలు ఇవ్వాలి. వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నరు. బిల్లులు సమర్పించాం వస్తాయని చెబుతున్నారు.

– గండెపల్లి నర్సయ్య, ఏటూరునాగారం

బిల్లులు చేసి పంపించాం



సిబ్బంది వేతనాలకు సంబంధించి బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం. ఎస్టీఓలో త్వరలో జమ అవుతాయి. వారి ఖాతాలో జమ అయ్యే వరకు కృషి చేస్తాం.

– రమాదేవి, పంచాయతీ కార్యదర్శి

మాదకద్రవ్యాలకు అలవాటు పడొద్దు



వెంకటాపురం(కె): పోస్టర్లను అంటించి అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై



ఏటూరునాగారం : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

వెంకటాపురం(కె): మాదకద్రవ్యాలకు అలవాటు పడితే కుటుంబాలు నాశనం అవుతాయని స్థానిక సీఐ బండారి కుమార్, ఎస్సై తిరుపతిరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నివారణ కోసం ముద్రించిన పోస్టర్లను పోలీసులు అంటించి అవగాహన కల్పించారు. యువత సన్మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వకూడదు

ఏటూరునాగారం: కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని స్థానిక ఎస్సై తాజొద్దీన్ ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని మల్యాల. కొండాయి గ్రామాన్ని పోలీస్ సిబ్బందితో కలిసి సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో గ్రామస్తులు చీకటిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై జీపీ సిబ్బందితో మాట్లాడి దీపాలను ఏర్పాటు చేయిస్తామన్నారు.

కొత్తవ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలి

గ్రామీణ ప్రాంత యువత మాదక ద్రవ్యాలకు మత్తుకు బానిస కావద్దని, తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై తాజొద్దీన్ యువతకు హితవు పలికారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో, వ్యాపార సముదాయాలలో దొంగతనాలు జరిగినట్లయితే నిందితులను గుర్తించడం కోసం సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి లబ్ధిదారుల దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరిన లబ్ధిదారులు

మంగపేట: మండలంలోని కమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు వర్తింపజేసేందుకు ఆన్‌లైన్‌లో జరిగిన తప్పొప్పులను సరిచేసేందుకు అధికారులు సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీకాంత్‌నాయుడు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, జీరో కరెంటు బిల్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పేర్లు, ఆధార్‌కార్డు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు కావడంతో పథకం వర్తించని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ఆన్‌లైన్ ద్వారా సరిచేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వాగతం పలకడానికి తరలిరావాలి



మాట్లాడుతున్న వావిలాల సాంబశివరావు

వాజేడు: ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకడానికి మాదిగ కులస్తులు భారీసంఖ్యలో తరలిరావాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ములుగు జిల్లా వైస్ ప్రెసిడెంట్ వావిలాల సాంబశివరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో చెన్నం స్వామి అధ్యక్షత ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలన్నారు. ములుగు జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎస్సీ కులస్తులు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో బలుసుపాటి రాజు మాదిగ, చెన్నం రవిబాబు మాదిగ, రామ్మూర్తి మాదిగ, గుగ్గిళ్ల చిరంజీవి మాదిగ పాల్గొన్నారు.

పీఆర్ ఏఈఈలను సన్మానించిన ఎమ్మెల్యే



భూపాలపల్లి రూరల్ : నియోజకవర్గ పరిధిలో నూతనంగా నియామకమైన పీఆర్ ఏఈఈలను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సేవలను అందించాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



రేగొండ : సభ్యత్వాలు అందజేస్తున్న సుభాకర్‌రెడ్డి



మొగుళ్లపల్లిలో..

రేగొండ : ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుస్స సదాకర్ ఆధ్వర్యంలో కొత్తపల్లిగోరి మండలంలోని కొత్తపల్లిగోరి, చిన్నకోడెపాక ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలని అన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భిక్షపతి, గిరిధర్ కృష్ణ, ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

మొగుళ్లపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లుల త్వరలో చెల్లింపులు జరుగుతాయని, త్వరలోనే మూడు డీఏలు మంజూరు అవుతాయన్నారు. సీపీఎస్ రద్దు ప్రాథమిక పాఠశాలలో 10 వేల పీఎస్ హెచ్‌ఎంల మంజూరు, మోడల్ స్కూల్ టీచర్ల 317 అమలు, 010 పద్దు ద్వారా వేతనాలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్, ఐఈఆర్‌పీ, ఎస్ఎస్ఏ సమస్యల పరిష్కారం, పాఠశాలల మౌళిక వసతుల కల్పన తదితర ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణరెడ్డి, సాంబయ్య, ఎ.చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లు రాకపోవడంతో ఎస్ఎంసీ చైర్మన్ మూత ఐలయ్య జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం కొనసాగిన గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా అందించిన ఫిర్యాదును జిల్లా విద్యాధికారికి అందించి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో బిల్లులు నిలిచిపోయాయని అందుకే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఐలయ్య తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



భూపాలపల్లి అర్బన్: ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు.ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1936 సంవత్సరంలో ఏర్పడిన విద్యార్థి సంఘం స్వాతంత్ర సమయంలో విద్యార్థులను ఏకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసఫ్, నాయకులు పోతుల పవన్, ఒద్దులే సాకేత్‌రెడ్డి, మహేందర్, రాధిక, చల్లూరి రక్షిత, గోలి లావణ్య, శరణ్య, రామ్‌చరణ్, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



చిట్యాల : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసి పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు పూజారి సుదయ్య, అనిశెట్టి శైలజ, కొప్పూరి అనితలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీడ్కోలు పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇంతకాలం ఇక్కడ పని చేయడం చాలా సంతోషకరంగా ఉందని, విద్యార్థులు చక్కగా చదువుకోవాలని మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చిదిరాల సరోజన, ఉపాధ్యాయులు సదయ్య, భాస్కర్, శ్రీనివాస్, వందన, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఇటీవల పదోన్నతిలో బదిలీపై వెళ్తున్న గంగిశెట్టి వెంకటేశ్వర్లును సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం స్వర్గం రమేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పద్మ, మేకల సదయ్య, సుధాకర్, పూర్వ విద్యార్థులు దూడపాక శ్రీనివాస్, హరికృష్ణ, ఆదర్శ్, అఫ్జల్, భరత్, వంశీ, సురేష్, బాబు, పవన్‌కళ్యాణ్, గ్రామస్తులు కుమారస్వామి, రవి, తిరుపతి, వంగ ప్రభాకర్, తిరుపతి, మహేందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మల్హర్: మండలంలో వల్లెకుంట గ్రామానికి చెందిన గడ్డం హర్షన్ మెడ సర్జరీ సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. సాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి ఆస్పత్రి సహాయకుడి ద్వారా హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

ఏటూరునాగారం: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి భూక్య సారంగపాణి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన టీచర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్.ఎం పోస్టులను మంజూరు చేసి డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతి కల్పించాలని కోరారు. ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు బకాయిలుగా ఉన్న ఐదు డీ ఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌సీ కమిటీ నివేదికను తెప్పించుకొని, వెంటనే అమలు చేయాలన్నారు.

మల్హర్‌రావు ఆశయాలు కొనసాగించాలి

- పెద్దపల్లి మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మల్హర్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మధు

మల్హర్: మారుమూల ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం తపించిన బెల్లంకొండ మల్హర్‌రావు చిరస్మరణీయుడని బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి మాజీ జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మల్హర్‌రావు 74వ జయంతి సందర్భంగా సోమవారం కొయ్యూర్ సెంటర్‌లోని మల్హర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆనాడు సర్పంచ్‌గా మల్హర్‌రావు మండల అభివృద్ధికి బీజం వేశారని గుర్తుచేశారు. కొయ్యూరు నాగులమ్మ ఆలయం నుంచి తాడిచర్ల వరకు రోడ్డు నిర్మాణం కోసం అధికారులను ఎదురించాడన్నారు. జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన కొమురం భీంస్ఫూర్తితోనే మల్హర్‌రావు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, రామరావు, కల్పన, మండల యూత్ అధ్యక్షుడు హరీష్, యాదగిరిరావు, రాము, హరిప్రసాద్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకునేందుకే 'హర్ ఘర్ తిరంగా'



మాట్లాడుతున్న జన్నె మొగిలి

భూపాలపల్లి రూరల్: దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి బీజేపీ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించిందని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ ప్రభారీ జన్నె మొగిళి అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మండల కోఆర్డినేటర్ విప్లవరెడ్డి ఆధ్వర్యంలో రూరల్ మండలాల కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా మొగిళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రజలందరూ వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని, నిబద్ధతతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టు రవి, భూపాలపల్లి రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కొమురయ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏటూరునాగారం: మండలంలోని 163 జాతీయ రహదారి రొయ్యూర్ పెట్రోల్‌బంక్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్ణాటకకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం సోమవారం రాత్రి 10 గంటలకు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి ఎస్సై తాజొద్దీన్ వెళ్లి మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అతడు ఎవరు అనేది ఇంకా తెలియాల్సి ఉందన్నారు. దీనిపై వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్

చిట్యాల: వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లేశ్ మాట్లాడుతూ వర్షాకాలంలో మండలంలోని 25 గ్రామాల్లో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని కోరారు. అలాగే గ్రామాల్లో దోమల మందు పిచికారి చేయాలని, బ్లీచింగ్ పౌడర్‌ను నీరునిల్వ ఉన్న చోట చల్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పర్లపెల్లి శ్రీకాంత్, నాయకులు బోడ అరేందర్, విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని చల్లగరిగ, తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి దొంగతనాలు జరుగకుండా ఉంటాయన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానం అని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యాకయ్య, నవీన్, లింగన్న, సందీప్, నాగరాజు పాల్గొన్నారు.